వరద కష్టం.. ఎంత నష్టం


ట్రాక్టర్లలో సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న కబేళావాసులు


వరద నీటిలోనే జక్కంపూడి కాలనీవాసులు


సింగ్‌నగర్‌లో కొట్టుడు పంపు వద్ద నీరు పట్టుకుంటున్న దృశ్యం


సింగ్‌నగర్‌లో సామగ్రి తరలిస్తున్న దృశ్యం

బుడమేరు వరద ముంపు నగర ప్రజలపై తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పుడిప్పుడే ముంపు ప్రభావిత ప్రాంతాలైన 'సెంట్రల్, పశ్చిమ' జనం తేరుకుంటున్నారు. వరద కష్టం వెంటాడుతున్నా.. తీరని నష్టం మిగిల్చిందని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికీ ఆహారం, నీరు, పాలు ముంపు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఇళ్లలో చేరిన మురుగు, సామగ్రిని శుభ్ర పరుచుకుంటున్నారు. నీటిలో మునిగిన వాహనాలను మెకానిక్‌ల వద్దకు తీసుకెళ్తున్నారు బాధితులు. వరద నీటిలో దుస్తులు తడవడం, గృహోపకరణాలు పాడవడంతో వారు అవస్థ పడుతున్నారు. వీటి మరమ్మతులకు చాలా ఖర్చవుతుందని ముంపు ప్రాంతవాసులు వాపోతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్స్, విజయవాడ


పైపులరోడ్డు సెంటర్‌లో..


నీటిలోనే తోటవారి వీధి


రాజీవ్‌నగర్ సమీపంలో కొట్టులో ఉంటున్న వరద బాధితురాలు


సుందరయ్యనగర్ కరకట్ట వద్ద ఫ్రిజ్‌ను శుభ్రం చేస్తున్న మహిళ


వాంబేకాలనీలో దివ్యాంగుడిని తీసుకువస్తూ..


కండ్రిక వద్ద ఆహార ప్యాకెట్లు ఇస్తున్న దాతలు


నందమూరినగర్‌లో శుభ్రం చేసుకుంటున్న స్థానికుడు


రాజీవ్‌నగర్ వద్ద వాటర్ బాటిళ్లు అడుగుతున్న బాధితులు


కండ్రిక ప్రాంతంలో వీధుల్లో నిలిచిన నీరు

క్లుప్తంగా

ముంపు ప్రాంతాల్లో 'చవితి' ప్రసాదాల వితరణ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఏపీ బీసీ సంఘాల కూటమి శనివారం వినాయక చవితి ప్రసాదాలను వితరణ చేసింది. బీసీ సంఘాల కూటమి చైర్మన్ ఎన్వీ రావు ఆధ్వర్యంలో కేఎల్‌రావునగర్, బ్యాంక్ కాలనీ, వీఎంసీ కాలనీ ప్రాంతాల్లో ప్రసాదాల వితరణ జరిగింది. ముంపు కారణంగా ఆ ప్రాంతాల్లో సామాన్యులు చవితి వేడుకలను నిర్వహించుకోవడం సాధ్యపడలేదని, దీంతో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రసాదాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం కన్వీనర్ డాక్టర ఎంపీఎస్. మూర్తి, కో కన్వీనర్ నమ్మి అప్పారావు, బాయన శేఖర్ బాబు, ధీరజ్, జస్వంత్‌లు పాల్గొన్నారు.

గ్యాస్ స్టౌలకు ఉచితంగా రిపేర్లు



భవానీపురం(విజయవాడపశ్చిమ): హౌసింగ్ బోర్డ్ కాలనీలోని వరద బాధితుల వంట గ్యాస్ స్టౌలకు ఆదివారం ఉచిత మరమ్మతుల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యాధరపురంలోని శ్రీభవానీ గ్యాస్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిబిరానికి వచ్చిన అనేక మంది బాధితులు స్టౌలను తీసుకువచ్చి మరమ్మతులు చేయించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీభవానీ గ్యాస్ కంపెనీ అధినేత గద్దె శ్రీహరిబాబు, భారత్ గ్యాస్ విజయవాడ సేల్స్ ఆఫీసర్ చాంద్ మండల్ పలు సూచలను చేశారు. కార్యక్రమంలో భవానీ గ్యాస్ కంపెనీ మేనేజర్ నీలిమ, వి. లక్ష్మణరావు, మెకానిక్‌లు రవీంద్ర, సాయి, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా నరహరిశెట్టి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా నరహరిశెట్టి నరసింహారావు నియమితులయ్యారు. నగర అధ్యక్షుడిగా మూడోసారి ఆయన చేయనున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు పదవి రావడంపై ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ బిల్లులు రద్దు చేయండి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాసకుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితుల కరెంట్ బిల్లులను రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాలు, వరదల కారణంగా సర్వం కోల్పోయిన బాధితుల నివాసాలు, చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించే వారు, కుటీర పరిశ్రమలు నడుపుకునే వారికి విద్యుత్ చార్జీలను మాఫీ చేయాలని పేర్కొన్నారు. ఈ నెల కరెంట్ బిల్‌ను వచ్చే నెల కట్టుకునే విధంగా సీఎం చంద్రబాబు రెండు రోజుల క్రితం ప్రకటించారని గుర్తు చేశారు. వారం రోజులుగా పనులు లేవని, బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు తర్వాతైనా ఎలా కట్టగలరని ప్రశ్నించారు. గృహ అవసరాల నిమిత్తం బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలనుకూడా మాఫీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అసత్య ప్రచారాలు చేయడం సరికాదు: మేయర్ రాయన



పటమట(విజయవాడతూర్పు): వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడానికి చర్యలు చేపట్టామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. కొందరు వ్యక్తులు కావాలనే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వారంరోజులుగా నగరంలోని ముంపు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించానని తెలియజేశారు. సామాజిక మాధ్యమాలలో మేయర్ మిస్సింగ్ అని పోస్టులు పెడుతున్నారని, అలాంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరద ముంపుతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఇలాంటి దుర్మార్గపు పోస్టులు పెట్టడం సరైన విధానం కాదని హితవు పలికారు. తన ఇల్లు కూడా వరద ముంపునకు గురైనా ప్రజా శ్రేయస్సు కోరుతూ నగర వ్యాప్తంగా అధికారులతో కలిసి బాధితులను పరామర్శించానని వీఎంసీ ద్వారా అవసరమైన సేవలు అందిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా వినాయక చవితి

- విఘ్నాధిపతికి తొలిపూజలు
- వరద ప్రభావంతో తగ్గిన సందడి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భజే గణనాథం అంటూ భక్తజనం వినాయకచవితి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాతబస్తీలో పలుచోట్ల విఘ్నాధిపతికి శనివారం తొలిపూజలు చేశారు. పాతబస్తీలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి ఆ మూషికవాహనుడి ఆశీస్సులందుకున్నారు. అయితే వరద ప్రభావంతో కొంత సందడి తగ్గింది. అడుగు నుంచి 15 అడుగుల వరకూ వివిధ స్వరూపాల్లో విభిన్న ఆకృతుల్లో గణపయ్య విగ్రహాలు భక్తులను కనువిందు చేశాయి. వన్‌టౌన్‌లోని పూలబావివీధి సుమారు 12 అడుగుల మేర భారీ గణనాథుడి ప్రతిమను ఏర్పాటు చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కందులవారివీధిలోని శ్రీ గణేష్ ఉత్సవ సమితి (మార్వాడీ సంఘం) ఆధ్వర్యంలో ప్రత్యేకరూపంలో ఉన్న గణపతిని ఏర్పాటు చేశారు. సమ్మెటవారి వీధిలో రైతు గణపతిని ఏర్పాటు చేశారు. వస్త్రలత ప్రాంగణంలో భారీ గణపతి విగ్రహాన్ని వస్త్ర వ్యాపారులు ఏర్పాటు చేశారు. కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ కాంప్లెక్స్‌లోనూ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. పూలబావి వీధిలోని ఉమాపుత్ర సేవా సమితి ఆధ్వర్యంలో భారీ గణపతిని ఏర్పాటు చేశారు. పాతబస్తీలోని జిల్లా హోల్‌సేల్ డ్రగ్ ట్రేడ్ సంఘం ఆధ్వర్యంలో తాటాకులవారివీధిలో భారీ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాయల్ హోటల్ సెంటర్, కోమలవిలాస్, మల్లికార్జునపేట ఇలా పలు ప్రాంతాల్లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో భారీ గణనాధునికి విగ్రహాలను ఏర్పాటు చేశారు.


కోమలావిలాస్ సెంటర్‌లో గణపతి విగ్రహం వద్ద మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు


వస్త్రలత ప్రాంగణంలో వినాయకుడు


పూలబావివీధిలో కొలువుదీరిన గణపతి

చుట్టూ మురుగు..

పాత ఆర్ఆర్‌పేట వాసుల అవస్థలు


పాత ఆర్ఆర్‌పేటలో ఇళ్ల చుట్టూ పేరుకున్న బురద


మురికినీటితోనే ఇళ్లు శుభ్రం చేసుకుంటున్న స్థానికులు

వించిపేట(విజయవాడపశ్చిమ): చుట్టూ మురుగుతో పాత ఆర్ఆర్‌పేట వాసులు అవస్థ పడుతున్నారు. బుడమేరు వరద ముంపుతో వారం రోజులుగా సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకుంటున్న పాత ఆర్ఆర్‌పేట ప్రాంతవాసులు ఆదివారం నీటి ప్రవాహం తగ్గడంలో ఇళ్లకు తిరుగుముఖం పట్టారు. ఇప్పటికీ పలు వీధులు మోకాళ్ల లోతు నీటిలో మునిగే ఉన్నాయి. మహంకాళమ్మగుడి వీధి, జేపీ టవర్స్ రోడ్డు, బీరువాల కంపెనీరోడ్డు, మణికంఠ్ మెడికల్స్‌వీధి తదితర ప్రాంతాల్లో మోకాళ్ల లోతు నీరు నిలిచే ఉంది. ఇళ్ల చుట్టూ మురుగు నీరు, వ్యర్థాలు పేరుకున్నాయి. భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఇలాంటి వాతావరణం కారణంగా అంటువ్యాధులు వ్యాపిస్తాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇంట్లోని గోడలు, వస్తువులు, పరుపులు, బట్టలు, వంట సామగ్రి ఇలా ప్రతి ఒక్కటి బురదతో నిండిపోయింది. ఇళ్ల ముందు నిలిచిన వరద నీటితోనే వీటి శుభ్రం చేసుకోవాల్సి వస్తోందని ఈ ప్రాంతవాసులు వాపోతున్నారు. వ్యాధులు ప్రబలకముందే పారిశుధ్య పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. వాటిని శుభ్రం చేసుకునేందుకు నీరు కూడా లేకపోవడంతో ఇళ్ల ముందు పారుతున్న వరద నీటిలోనే శుభ్రపర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి అంటు వ్యాధులు ప్రబలక ముందే పారిశుధ్య పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

వరద బాధితులకు అండగా..

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని వరద బాధితులకు అంబవరం నీరా చారిటబుల్ ట్రస్టు, ప్రణతి గ్లోబల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫౌండేషన్ సభ్యులు తమవంతు సహకారం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ అంబవరం ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ బ్రహ్మానందరెడ్డి నగరంలోని వరద ప్రాంతాలకు వెళ్లి భోజనం, మంచినీటి బాటిళ్లతో పాటు, దుప్పట్లు, చీరలు, పంచెలు, బిస్కెట్లు అందిస్తూ వారిలో ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా సర్వం కోల్పోయిన ప్రజల్లో మనోస్థైర్యాన్ని నింపుతూ సైకాలజిస్టులు శ్రావణకుమారి, రమాదేవి, దాక్షాయని తదితరులు వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): జయ భారత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుడమేరు వరద ప్రాంతాలైన గట్టు వెనుక ప్రాంతంలోని వివిధ ప్రదేశాల్లోని వరద బాధితులకు ఆదివారం దుప్పట్లు, పాదరక్షలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ ఎస్. శ్రీనివాస్, సెక్రటరీ శ్రీదేవి పవన్, ట్రెజరర్ జ్యోతి, పూర్ణ, సురేంద్రసింగ్, ఎస్‌కేఆర్‌ఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

గట్టు వెనుక ప్రాంతం 45వ డివిజన్ పరిధిలోని జోజినగర్‌లో వరద ముంపులో చిక్కుకున్న బాధితులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ జాతీయ సమితి కార్యవర్గ సభ్యులు, రాజ్యసభలో సీపీఐ పక్ష నాయకులు సంతోష్‌కుమార్ చేతుల మీదుగా ఆదివారం దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు, పార్టీ నేతలు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు, పండ్లు ఇస్తున్న జయ భారత్ సభ్యులు

కంకిపాడు: పటమట అభ్యుదయ జూనియర్ కాలేజ్ 2002 బ్యాచ్ పూర్వ విద్యార్థులు వరద బాధితులకు తమ వంతు సహాయాన్ని అందించారు. పైపుల రోడ్డు ప్రాంతంలోని ముంపు ప్రాంతాలకు ఆదివారం పూర్వ విద్యార్థుల బృందం 300 కుటుంబాలకు భోజనాలను అందించింది. నాగేశ్వరరావు, ఏ.దుర్గాప్రసాద్, ఎన్.శ్రీరాములు, ఎండీ గయాస్, పి.రమాదేవి, మగ్బుల్ తదితరులు పాల్గొన్నారు.


వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామకృష్ణ


పైపులరోడ్డులో ఆహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

జక్కంపూడి కాలనీలో విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వరద ముంపు కారణంగా జక్కంపూడి కాలనీలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శనివారం నుంచి కాలనీ బ్లాకులను పరిశీలించిన విద్యుత్‌శాఖ అధికారులు వరద ముంపుతో దెబ్బతిన్న మీటర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. ఏపీసీపీడీసీఎల్ ఎస్‌ఈ మురళీమోహన్, ఈఈ హరిబాబు, ఏడీఈ బాలాజీ, ఏఈ రాజశేఖర్ కాలనీలో విద్యుత్ సరఫరాపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. కాలనీలోని బ్లాకుల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల దిగువకు వరద నీరు చేరడంతో ఆదివారం నుంచి మీటర్లను సిబ్బంది పరిశీలించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన సామగ్రిని ట్రాక్టర్లపై బ్లాకుల వద్దకు తరలించడమే కాకుండా హుటాహుటిన వాటిని విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేస్తున్నారు.

సుమారు రెండు వందల మంది జిల్లాతో పాటు గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎట్టి పరిస్థితుల్లో మరో 36 గంటల్లో జక్కంపూడి కాలనీకి విద్యుత్‌ను పునరుద్ధరిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ ఎప్పుడు జరుగుతుందంటూ మహిళలు సిబ్బందిని ఆరా తీయడం కనిపించింది.


మీటర్లకు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

పారిశుధ్య పనులు సక్రమంగా చేయాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగర పరిధిలో సక్రమంగా పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఆయన ఆదివారం విజయ టాకీస్ వద్ద కూర్మయ్య వంతెనలో వ్యర్థాలను చూశారు. వాటిని తొలగించాలని చెప్పారు. అనంతరం ఆయన అజిత్‌సింగ్‌నగర్, గురునానక్ కాలనీ రోడ్, రమేష్ హాస్పిటల్ రోడ్, అమ్మ కల్యాణ మండపం ప్రాంతం, సిద్ధార్థ కాలేజీ, విజయ టాకీస్ తదితర ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజల నుంచి వ్యర్థాల సేకరణ ప్రతిరోజూ జరగాలని, వాటిని ఎప్పటికప్పుడు అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్‌ప్లాంట్‌కు తరలించాలని, అక్కడ నుంచి జిందాల్ ప్లాంట్‌కు తరలిస్తూ వ్యర్థ నిర్వహణ చేయాలన్నారు. వరద ప్రభావం లేని మిగిలిన 32 వార్డుల్లో కూడా పారిశుధ్య కార్మికులు శుభ్రంగా ఉంచాలని చెప్పారు. ప్రజలు కూడా సహకరించాలన్నారు.


అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పున్నమరాజు సామాజిక సేవలు ఆదర్శనీయం

విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు పున్నమరాజు ఎస్వీ మురళీకృష్ణ సామాజిక సేవలను ఆదర్శంగా తీసుకోవాలని కళాపోషకుడు గోళ్ల నారాయణరావు తెలిపారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, శ్రీ కేవీ బ్రహ్మానందరావు కళా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం శాస్త్రీయ సంగీత కచేరి, సంగీత విద్వాంసుడు పున్నమరాజు మురళీ కృష్ణకు ఆత్మీయ సత్కార కార్యక్రమం, సినీ సంగీత విభావరీ నిర్వహించారు. నారాయణ రావు మాట్లాడుతూ తిరుపతిలోని మానసిక దివ్యాంగుల కేంద్రం ఆచార్యులుగా విశిష్టమైన సేవలను అందిస్తున్నారన్నారు. సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావు మాట్లాడుతూ.. కళాకారులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, బోడి అంజనేయరాజు, సింగంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. శాస్త్రీయ సంగీత కచేరీ జరిగింది.


మురళీకృష్ణను సత్కరిస్తున్న నిర్వాహకులు